# ఈ జీవితం ఇలా సాగిపోనీ

**నవంబరు పంథొమ్మిదో తేదీ సాయంత్రం 'కళాభారతి' ఆడిటోరియమ్ కొత్త పెళ్ళికూతురిలా కళకళ లాడుతోంది. ప్రఖ్యాత కళాపోషకుడు రమణయ్య రాజాగారి పుట్టినరోజు సందర్భంగా అవార్డు ప్రముఖ సాహితీవేత్తకు అంద జేయడానికి నిర్ణయించిన శుభప్రదమైన సమయం అది!**

భవాని ఆటో దిగి చుట్టూ చూసింది. గేటు కివతల చాలా కార్లు నిలిచి వున్నాయి. చాలా మంది కార్లలోనే వస్తున్నారు.

అలాంటి సాంస్కృతిక కార్యక్రమాలంటే చాలా వుత్సుకత చూపిస్తుంది భవాని. ఆమె వెళ్లేసరికి అప్పుడే డాన్సు ప్రోగ్రాం అవుతున్నది. ప్రోగ్రాం అయిపోయేక కళాకారుల్ని ఒక్కొక్కరిని వేదిక మీదకు ఆహ్వానిస్తున్నారు. అంతసేపు తన సుమధుర గాన మాధుర్యంతో ప్రేక్షకుల్ని ఆకట్టుకున్న అతన్ని బాల మురళీకృష్ణ శిష్యుడిగా పరిచయం చేసేరు. అప్పుడు పట్టి చూసింది అతన్ని. అదేమిటి? అంత చక్కటి గళాన్ని ప్రసాదించిన ఆ దేవుడు అతనికి నేత్ర కాంతిని దూరం చెయ్యాడం చాలా అన్యాయం అనిపించింది.

వీడియోగ్రాఫర్లు అక్కడున్న అందర్నీ తమ కెమేరాల్లో బంధించడానికి తంటాలు పడుతున్నారు. ఆ లైట్లు కంట్లో పడకుండా చెయ్యి అడ్డపెట్టుకుని చూస్తున్న భవాని దృష్టి హఠాత్తుగా రెండు వరుసల ముందు... కుర్చీల్లో కూర్చున్న.. వాళ్ళిద్దరి మీదా పడింది.

భవాని మనసు వాళ్ళని చూడగానే పురివిప్పిన నెమలిలా అయింది. అనిర్వచనీయ మైన సంతోషంతో మనసు నిండిపోతూంది. ఆమె పెదవులు సన్నగా విచ్చుకున్నాయి.

"సా... కే... తా..." విచ్చుకున్న పెదవులు అస్పష్టంగా గొణుగుతూంటే భవాని అటే చూస్తున్నది. సరిగ్గా మూడు సంవత్సరాల తర్వాత, తన అత్యంత ఆత్మీయు రాలిని... అక్కడ... అలా చూడ్డం... మాటల కందని వింతైన.. అనుభూతి!

"సాకేత... తనని చూడలేదా? చూస్తే పిచ్చిదానిలా పరుగెత్తుకొచ్చి తనని గట్టిగా చుట్టేస్తుంది. అది చూడలేదు. ఆ పక్కన వున్నతను ఎవరో?! బహుశా దాని 'బెటర్ హాఫ్' అయి వుంటాడు!

"అబ్బా ఎన్నాళ్లయిందే నిన్ను చూసి! ఆ రోజులే వేరు, ఎంచక్కా డాబా మీద వెన్నెల్లో కూర్చుని నీ కాబోయే భర్త ఎలాంటివాడయి వుండాలి? అంటే నువ్వు ఎలాంటి వాడిని భర్తగా వూహించు కుంటున్నావు?" అంటూ ఎన్నో రంగురంగుల కలలు కనేవాళ్లం గుర్తుందా భవానీ?" అని తనని చూసిన పిచ్చి ఆనందంతో చేతులు పట్టుకు వూపేస్తూ అంటుంది. ఇంకా "బై...ది..బై.. ఈయన మా శ్రీవారు" అంటూ ఆయన్ని పరిచయం చేస్తూ 'ఇది నా ఆరవ ప్రాణం?' అని ఆయనతో ఖచ్చితంగా అంటుంది! అంతటి సన్నిహితత్వం తమిద్దరిమధ్య వుంది మరి!...పెళ్ళి అయిందని వింది. ఏ కారణం చేతనో, స్టుపిడ్: పెళ్ళిక్కూడా పిలవలేదు! మూడు సంవత్సరాలయింది. వాళ్ల నాన్నగారికి విశాఖపట్నం నించి హైదరాబాద్ బదిలీ అవడంతో వాళ్లందరూ వెళ్లిపోయారు.

ఆ తర్వాతే దాని పెళ్లి అయిందని తెలిసింది. అది ఉత్తరం వ్రాసి వుంటుంది. పోస్టల్ వాళ్ళ పుణ్యమా అని తనకే అంది వుండదు! అది పెళ్ళికి పిలవక పోయినా రెక్కలు కట్టుకుని వెళ్ళేంత చనువు తనకి వుంది. కాని దాని పెళ్లి ఎప్పుడో తెలిస్తే కదా?!

భవాని లేచింది. అప్పటికే కొంతమంది తమ తమ సీట్లలోంచి లేచి వెళ్లిపోతున్నారు. పిల్లలు యిటూ - అటూ తిరుగుతున్నారు. కొంతమంది బయటకెళ్ళి చాక్‌లెట్లు, బిస్కట్ ప్యాకెట్లు, క్వాలిటీ ఐస్‌క్రీంలతో మళ్లీ వస్తున్నారు. భవాని తన సీట్లోంచి లేచి ముందుకు వద్దామంటే ఆమె పక్క సీట్లలోని యిద్దరు మగవాళ్లు అడ్డంగా నించుని వున్నారు. వాళ్లని దాటుకుని వెళ్లడం కష్టం, వాళ్లు కూర్చుంటేనే తను ముందుకు సాగాలి.

"ఎక్స్‌క్యూజ్‌మీ... కొంచెం సైడు యిస్తారా?"

వాళ్లు ఒకసారి భవానివైపు చూసి తమ తమ సీట్లలో కూర్చున్నారు. ఈ హడావుడిలో భవాని గమనించని విషయం ఒకటుంది!

రెండు వరుసలు ముందు కూర్చున్న వాళ్లిద్దరూ లేచి బయటకు వెళ్ళిపోయారు. భవాని ఆ వరసకి దగ్గరగా వచ్చి అటువైపు చూసేసరికి వాళ్ళిద్దరూ లేరు!

చిన్నపిల్లలా పరిగెత్తింది అవతలకి.

"సాకేతా... సాకేతా..." ఆమె పిలుపు గాల్లో కలిసిపోయింది.

సాకేత, తనని చూడలేదు అని అనుకోవడానికి ఎందుచేతనో ఆమె మనసు ఒప్పుకోవడం లేదు.

సాకేత తనని చూసింది!

ఆ సంగతి తనకి బాగా తెల్సు!

వాళ్ళిద్దరూ ఏదో మాట్లాడుకుంటున్నప్పుడు... సాకేత... ఎందుకనో ఓసారి తల తిప్పి వెనక్కి చూసింది సరిగ్గా... అప్పుడే... తను సాకేతని చూసి పలకరిద్దామనుకునే లోపునే ఆమె తల తిప్పేసుకుంది. "బహుశ తనని పోల్చి వుండదు. ఏదో యధాలాపంగా చూసి వుంటుంది. అంతే" అని మనసుని సరిపెట్టుకోలేకపోతున్నది!

భవాని మనసంతా చేదు తిన్నట్టుగా అయిపోయింది.

ఇన్నాళ్ల తర్వాత స్నేహితురాలిని చూసిన ఆనందమంతా ఒక్క నిముషంలో ఆవిరైపోయింది. మళ్లీ హాలులోకి వెళ్ళి కూర్చోవాలనిపించలేదు.

ఆటోలో యింటికి వచ్చేసింది.

గతకాలపు జ్ఞాపకాలన్నీ కందిరీగల్లా ఆమె మనసు చుట్టూ ముసురుకున్నాయి.

★ ★ ★

సాకేతకి నలురుగు చెల్లెళ్ళూ. ఒక తమ్ముడూ వున్నారు. అమ్మ ఎప్పుడూ ఏదో జబ్బుతో మంచంమీదే వుండేది. నాన్నగారికొచ్చే జీతం వాళ్ళందర్నీ పోషించడానికి బొటాబొటిగా సరిపోయేది.

తను, సాకేత: అప్పుడు బి.ఎ. రెండవ సంవత్సరం చదువు తుండేవారు. సాకేత అందమైనది. ఆమె అందంలో విలక్షణమైన తీరు వుంది. ఆమె నవ్వు, నడక, వంపు సొంపులు ఎదుటివాళ్ళని ఉత్తేజితుల్ని చేసేలా వుంటాయి. అందుకేనేమో మధు సాకేత ప్రేమలో పడ్డాడు. సాకేత, మధులు ప్రేమలో పడ్డారన్న సంగతి తనకి కొంచెం ఆలస్యంగా తెలిసినందుకు సాకేతని తిట్టింది చనువుగా. "మనిద్దరి మధ్యా ఎలాంటి రహస్యాలు లేనప్పుడు ఈ విషయాన్ని నా దగ్గర ఎందుకు దాచేవు? మధు చెప్పొద్దన్నాడా?'' అంటూ నిలదీసింది.

"అదికాదే మొద్దూ! అందరికీ తెలిసిపోతే కాలేజీ గోడల మీద మా పేర్లు ఎక్కించేస్తారేమోనని... నా భయం.''

"అయితే నాకు చెప్పడానికేమే? ఏం, నేనుకూడా గోడల మీద మీ పేర్లు రాసేస్తాననుకున్నావా? అయినా మధు ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్నాడు. మనది ఆర్ట్స్ కాలేజి.''

"ఎక్కడ చదివినా... ఎవరెవరు ప్రేమించుకుంటున్నారో తెల్సుకోవడమే పనిగా పెట్టుకున్న కొంతమంది కుర్రాళ్లు వున్నారులే. వాళ్లకిది పెద్ద కష్టం కాదు. అదే మధు భయం కూడా...''

"ఏది ఏమయినా సరే నేను నీ డియరెస్టు... ఫ్రెండ్‌ని కదా...'' మూతి ముడిచింది భవాని.

"అబ్బ తప్పయిపోయింది. క్షమించు తల్లీ'' అంది సాకేత రెండు చేతులూ తమాషాగా జోడించి నవ్వుతూ.

అందరు ప్రేమికుల్లాగే వాళ్లిద్దరు కూడా పార్కుల్లో దట్టంగా పెరిగిన క్రోటన్స్ మొక్కల వెనక, బీచ్‌లో ఎవరూ లేనిచోట, సినిమా హాలులోని వెనక సీట్లలో, ఎక్కువగా జనం రాని, అర్చనకు - పూజకు అంతగా నోచుకోని గుడిలో ప్రతీరోజూ కలుసు కుంటూ వుండేవారు.

మధు సమక్షంలో సాకేత ఈ ప్రపంచాన్నే మర్చిపోయేది. తనని ప్రేమించే పురుషుడి సాహచర్యం ఏ స్త్రీకయినా నిత్యనూతనంగా, ఆనందంగా వుంటుంది. మధు కూడా సాకేత ఎదురుగా వుంటే చాలు తనని తాను మర్చిపోయేవాడు. సప్తవర్ణాల హరివిల్లు తన ఎదురుగా నిల్చున్నట్టుంటుంది మధుకి. సాధారణంగా చాలా ప్రేమలు పెళ్లికే దారి తీస్తాయన్నది వాస్తవం! జీవితం గురించి, భర్త సంసారం గురించి రంగురంగుల కలలు కన్న ఏ ఆడపిల్లయినా వూరికే ప్రేమిస్తూ కూర్చోదు! పెళ్ళి విషయం ఎత్తుతుంది. పెళ్లి మాట ఎత్తేసరికి మధు భయపడ్డాడు.

సాకేత అంటే ప్రేమ లేక కాదు. అతని తల్లిదండ్రులను తల్చుకుని!

మధు ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్నాడు. కొడుకు ఇంజనీరు అనేసరికి కట్నం బాగా రాబట్టవచ్చనే అభిప్రాయంలో వున్నారు వాళ్లు. మధు - సాకేత ఇద్దరూ భయస్థులే. పెద్దవాళ్లని ఎదిరించలేని పిరికివాళ్లు. "పిరికి వాళ్లకి ప్రేమేమిటి?'' అనేసింది భవాని.

వాళ్లిద్దరూ ఒకరంటే ఒకరు పూర్తిగా ఇష్టపడ్డారు. మధు తల్లిదండ్రుల దగ్గర ధైర్యం చేసి సాకేతకీ తనకీ ఆశించుకున్న ప్రేమ - పెళ్ళి గురించి చెప్పేడు. వాళ్ళు ఎంతమాత్రం వప్పుకోలేదు. అయిదుగురు ఆడపిల్లల తండ్రి ఏమీ ఇచ్చుకోలేడని వాళ్లకి తెల్సు. ఫలితంగా మధువాళ్ల నాన్నగార్కి రాజమండ్రి బదిలీ అయిపోయింది. ట్రాన్స్‌ఫర్ అయిందో, చేయించుకున్నారో తెలీదు. కాని

వాళ్లందరూ ఆ వూరు వదిలి వెళ్లిపోయారు. సాకేత వెక్కి వెక్కి ఏడ్చింది భవాని దగ్గర. మధును వదులుకోలేక జీవితంతో రాజీ పడలేక సాకేత మనసు చిత్రవధ అనుభవించ సాగింది. రోజూ కాలేజికి వెళ్లివస్తోంది. కాని ప్రాణంలేని మరబొమ్మలాగా వుంది ఆమె. కొన్ని విచిత్ర పరిస్థితుల్లో రాజు పరిచయం అయ్యాడు సాకేతకి. రాజు సాకేతని ఎంత పిచ్చిగా ప్రేమించడం మొదలెట్టా డంటే ఇహ సాకేత గురించి ఎవరేం చెప్పినా తను ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుని తీర్తాననే నిర్ణయానికి వచ్చేసాడు. మధ్యలో భవాని ఇరుక్కుపోయింది. ఇటు రాజు భవాని ప్రాణం తీసేసేవాడు తను వ్రాసిన ఉత్తరాలు సాకేతకి అందించమని! కొన్నాళ్లు తనకి ఆ పోస్టుమాన్ పని తప్పలేదు. కాని సాకేత మధుని మర్చిపోలేకపోయింది. అసలు రాజు అంటే తనకి ఎలాంటి అభిప్రాయమూ లేదు.

సాకేత అస్సలు రాజుతో మాట్లాడ్డానికే ఇష్టపడేది కాదన్న విషయం భవానికి తెల్సినా, రాజుకి సాకేత పట్ల వున్న వెర్రి ప్రేమ తెల్సి ఆ విషయం చెప్పడానికి సాహసించలేక పోయేది. రాజుకి సాకేత పట్ల ప్రేమ ఎక్కువవుతున్నకొద్దీ, సాకేత నిర్లిప్తత, నైరాశ్యం కూడా ఎక్కువకాజొచ్చేయి. ఆఖరికి భవాని ఒక రోజు సాకేతతో నచ్చజెప్తున్నట్టుగా అంది.

"నువ్వు వూరికే మధుని మర్చిపోలేకుండా పగలు - రాత్రి మధు ధ్యాసలోనే గడిపేస్తున్నావు. కాని ఒక్కసారి బాగా ఆలోచించు సాకేతా! నిజంగా మధుకి నీ మీద అంత ప్రేమే వుంటే, మనస్ఫూర్తిగా నిన్ను ప్రేమించి వుంటే, తల్లిదండ్రుల్ని ఎదిరించైనా సరే నిన్ను తనదానిగా చేసుకుని వుండేవాడు. తల్లిదండ్రులకి ఎదురుచెప్పలేని పిరికివాడు నీ మెడలో తాళి కడ్తాడని యింకా నువ్వు అనుకుంటున్నావా పిచ్చిదానా? మధు ఎప్పుడో నిన్ను మర్చిపోయి తనదారి తను చూసుకున్నాడు. నువ్వెందుకు యింకా వెర్రిదానిలా ఆ జ్ఞాపకాలలో వుండిపోవడం చెప్పు? ఒక్కసారిగా ఆ జ్ఞాపకాల నుంచి బయటపడి చూడు. నువ్వు ప్రేమించేవాడికోసం కంటే నిన్ను ప్రేమించేవాడి కోసం శ్రద్ధ చూపించుకోవాలి. రాజుని వదులుకుంటే అది నీకు మరో దెబ్బ అవుతుంది. రాజు నిన్ను పెళ్లిచేసుకుందికి సిద్ధంగా వున్నాడు. నా మాట విని రాజు ప్రేమని తిరస్కరించకు."

ఎందుచేతనో మరి... కొంతమంది మీద... అకారణంగానే అయిష్టత ఏర్పడుతుంది!?

భవాని ఎంత చెప్పినా కూడా సాకేత, రాజుని ఆ దృష్టితో చూడలేకపోయింది.

విధి విచిత్రం - సాకేత తండ్రిగారు సాకేత కోసం మంచి సంబంధం చూసేరు. సరిగ్గా ఆ టైములోనే వాళ్ల నాన్నగార్కి బదిలీ అవడం, వాళ్లందరూ వూరొదిలి వెళ్లిపోవడం జరిగింది. సాకేతకి పెళ్లి అయిపోయిందని విన్నది. కాని యింత సన్నిహితంగా వున్న తనకి కనీసం శుభలేఖ లయినా పంపకుండా పెళ్లి ఎలా చేసుకుందోనన్న విషయం యిప్పటికీ అర్థంగాని ప్రశ్నలా మిగిలిపోయింది భవాని మనసులో. భవాని దేన్నీ మనసులో పెట్టుకోదు. అలాంటిది - అత్యంత ఆత్మీయురాలు, ప్రియమైన స్నేహితురాలు అలా ఎందుకు ప్రవర్తించిందో, నిన్న ఫంక్షన్‌లో చూసి కూడా ఎందుకు తనని తప్పించుకుని ఫంక్షన్ పూర్తికాకముందే ఎందుకలా వెళ్లి పోయిందో ఎంత జుట్టు పీక్కున్నా అర్థంకావడం లేదు. ఆమెని నిరంతరం వేధిస్తున్న ప్రశ్నకి నాలుగు రోజుల తర్వాత సాకేత ఉత్తరం ద్వారా జవాబు దొరికింది!!!

"భవాని!

ఆ రోజు నిన్ను తప్పించుకుని వెళ్లిపోయినందుకు నీకు చాలా కోపం వచ్చివుంటుం దని నాకు తెల్సు. నన్ను మనస్పూర్తిగా క్షమించగలదానివి నువ్వు ఒక్కర్తివే. ఆ రోజు నా పక్కనున్న వ్యక్తి నా జీవిత భాగస్వామి! నా మెడలో తాళికట్టి నా మీద సర్వహక్కులు పొందేనని విర్రవీగే ఒక సగటు మగాడు! అనుమాన పిశాచానికి మరో పేరు ఆయన! వీధి గుమ్మంలో ఒక్కర్తినే నించున్నా, ఆయన స్నేహితులతో మాట్లాడినా అనుమానంతో అనరాని మాటలు అనే మనిషి! తన పెళ్లాన్ని (నన్ను) ఎవరు ఎత్తుకుపోతారో నన్నట్టుగా ఎప్పుడూ సూది వెంట దారంలా వెంటనే వుంటారు. నువ్వు అసలే వాగుడుకాయవి. సరదాగానే అన్నా గతంలోని కొన్ని తీపి, చేదు సంఘటనల్ని ఆయన ముందు ఎక్కడ వెళ్లగక్కుతావోనని నాకు భయం వేసింది భవానీ! ముఖ్యంగా మధు గురించి అతని ముందే నాతో మాట్లాడేస్తావేమోనని నా నరనరాల్లోనూ వణుకుపుట్టింది. ఆయన ఆవులించకుండానే ప్రేగులు లెక్కపెట్టే రకం. అందుకే నేను ఏదో పనుందని చెప్పి ఆయన్తో కల్సి అర్జంటుగా బయటపడ్డాను. నన్ను క్షమించు భవానీ! నా ప్రేమ కథని గొయ్యి తవ్వి పాతిపెట్టి పైన మట్టితో కప్పేసేను. ఆ గతాన్ని తవ్వి వెలికితీసి నా ముందుకు ఎప్పుడూ తేవద్దని రెండు చేతులు జోడించి అర్థిస్తున్నాను. ఆ అనుమానం తప్ప మిగతా అన్ని విషయాల్లోనూ నన్ను చాలా బాగా చూసుకుంటారు ఆయన! అది చాలు నా జీవితానికి! అందుకే ఈ జీవితం యిలా సాగిపోనీ! మరొకసారి నన్ను క్షమించమని కోరుతూ నిన్ను ఎప్పటికీ మర్చిపోలేని నీ పిరికి స్నేహితురాలు - సాకేత."

★ ★ ★

*(వనితాజ్యోతి, మంత్లీ ; జనవరి 1997)*